నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శనివారం 4 మే 2024 | MEDAK

కాంగ్రెస్, బీజేపీలను మట్టికరిపించాలి

సద్దితిన్న రేవును తలవాలి.. వినోదన్నను గెలిపించాలి

మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్

- ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు కర్రుకాల్చి వాత పెట్టాలి
- ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను కొనసాగించేందుకు కుట్ర
- కేసీఆర్ పథకాలన్నీ గోవిందా.. కాంగ్రెస్ హామీలన్నీ గోవిందా..
- అక్కన్నపేట రోడ్‌షోలో మాజీమంత్రి హరీశ్‌రావు

అక్కన్నపేట, మే 3: సద్దితిన్న రేవును తలవాలని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు కర్రుకాల్చి వాత పెట్టి కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండల కేంద్రంలో ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చంద్రబాబు శిష్యుడని, అక్కడ చంద్రబాబు గెలిస్తే ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌ను మరికొన్నేండ్లు కొనసాగించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలకు రాజకీయ ప్రయోజనాలే తప్పా రాష్ట్ర ప్రజలను పట్టించుకోరన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తానన్న కాంగ్రెస్ సర్కారు 150 రోజులైనా హామీల అమలు ఏమైందని ప్రశ్నించారు. హామీల్లో భాగంగా కాంగ్రెసోళ్లు ఇచ్చిన బాండ్ పేపర్లు బొన్స్ అయ్యాయని, ఇందుకు శిక్షపడాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలు నిత్యం దేవుళ్ల మీద ఒట్లు... కేసీఆర్ మీద తిట్లు తప్పా చేసేదేమీ లేదన్నారు. ఆచరణలో సాధ్యంకానీ హామీల పేరిట ప్రజలను, ఓటర్లను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ సర్కారు హయాంలోని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ సర్కారు గోవిందా అన్నట్లు వ్యవహరిస్తున్నట్లు అభివర్ణించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు కాంగ్రెస్ అడ్డుపడ్డా నిర్మాణం పూర్తి చేసి గోదావరి జలాలను నింపిన ఘనత కేసీఆర్ సర్కార్‌దేనని కొనియాడారు. అభివృద్ధి సాధకుడు వినోదన్న అని, అక్కన్నపేట అభివృద్ధి చెందాలంటే కారుగుర్తుకు ఓటేసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఐదేండ్లలో బండి సంజయ్ కరీంనగర్ నియోజకవర్గానికి ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు అంటేనే మోసమని, బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం రూ.1000 కోట్లు తీసుకొచ్చానన్నారు. అభివృద్ధి అంటేనే బీఆర్ఎస్ అన్నారు. విధ్వంసం అంటే కాంగ్రెస్, బీజేపీ నని అభివర్ణించారు. హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన తప్పు పార్లమెంట్ ఎన్నికల్లో జరగొద్దన్నారు. మన ప్రాంతం గురించి పార్లమెంట్‌లో మాట్లాడకపోతే మన బతుకులు మళ్లీ ఆగమ్యగోచరంగా మారుతాయన్నారు. ప్రజలు ఆలోచన చేసి కారు గుర్తుకు ఓటేసి వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ మాలోతు లక్ష్మిబీలూనాయక్, జడ్పీటీసీ భూక్య మంగ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, సేవ్‌లాల్ లేబర్ కోఆపరేటివ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అక్కన్నపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ రోడ్‌షోకు హాజరైన ప్రజలు

ప్రజలారా.. ఆలోచించండి

జిల్లాను రద్దు చేసే కుట్ర చేస్తున్న రేవంత్.. మన జిల్లాను తీసేస్తా అన్న వాళ్లకు ఓటు వేయాలా?

- జిల్లాలు తీసేసి ప్రజలకు అభివృద్ధిని దూరం చేస్తారా..?
- మా నిధులు రద్దు చేసిన నీకు ఓటు అడిగే నైతిక హక్కు లేదు...
- సిద్దిపేటకు ఏం చేయలేదో రేవంత్‌రెడ్డి చెప్పాలి
- రేవంత్‌రెడ్డిలా స్థాయిని దిగజార్చుకోలేను...
- సిద్దిపేటలో మీడియా సమావేశంలో మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటలో మాట్లాడుతున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మే 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ''సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేట జిల్లాను రద్దు చేసే కుట్ర చేస్తున్నాడు. మా జిల్లా ఊడపీకుతా అన్న నీకు మా జిల్లా ప్రజలు ఓట్లు వేయాలా? సిద్దిపేట ప్రజలారా ఆలోచించండి.. మన జిల్లాలు తీసేస్తే అని, మన ఆత్మగౌరవ ప్రతీక కేసీఆర్‌ను అగౌరవపర్చిన రేవంత్‌రెడ్డికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి'' అని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం సిద్దిపేటలోని తన నివాసంలో రాజనర్సు, రవీందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, సాయిరామ్, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సోందెర్డిలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. వరంగల్‌లో మీరున్నప్పుడు అక్కడ మీ నాయకులు జిల్లాలు తక్కువ చేయాలని మాట్లాడితే మీరు చప్పట్లు కొట్టింది వాస్తవం కాదా? ముసిముసి నవ్వులు నవ్వావు.. అంటే జిల్లాలు రద్దు చేసే కుట్ర చేస్తున్నావు కదా అని ప్రశ్నించారు. దశాబ్దాల పోరాటం, కేసీఆర్ కృషి ఫలితం మన సిద్దిపేట జిల్లా అని చెప్పారు. రేవంత్‌రెడ్డి ఏ జిల్లాను తీసేస్తారు? జిల్లాలు తీసి అభివృద్ధిని ప్రజలకు దూరం చేస్తావా? కేసీఆర్ పరిపాలనను వికేంద్రీకరణ చేస్తే .. మీరు కేంద్రీకరణ చేస్తారా అని సూటిగా ప్రశ్నించారు. రేవంత్ నోట ఎప్పుడు కూడా నిజాలు రావన్నారు. ఆయన సిద్దిపేటకొచ్చి అభివృద్ధి జరగలేదన్నారు. ఇది నిజమా? అబద్ధమా? ఇంతకంటే పచ్చి అబద్ధం ఇంకోటి ఉంటదా అని అన్నారు. రేవంత్‌రెడ్డి కండ్లు చూడలేక పోతుండా.. కావాలని అబద్ధాలు ఆడుతున్నాడా? రాష్ట్రంలోనే కాదు దేశంలో పేరొందిన నియోజకవర్గాల్లో సిద్దిపేట ఒకటి అని హరీశ్‌రావు అన్నారు. అభివృద్ధిలో రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు ఎన్నో అందుకున్నది సిద్దిపేట నియోజకవర్గం అని చెప్పారు. రాష్ట్రస్థాయిలో జాతీయస్థాయిలో అవార్డులు ప్రకటిస్తే సిద్దిపేట పేరు లేకుండా అవార్డే లేదన్నారు.

సిద్దిపేటకు ఏం చేయలేదో చెప్పు

కేసీఆర్, హరీశ్‌రావు సిద్దిపేటకు ఏం చేశారని రేవంత్‌రెడ్డి అడుగుతున్నాడు..? మరి సిద్దిపేటకు ఏం చేయలేదో చెప్పాలన్నారు. కేసీఆర్ సిద్దిపేటను జిల్లా చేసిండు, రైలు తెచ్చిండు, గోదావరి నీళ్లు, పోలీస్ కమిషనరేట్ తీసుకొచ్చారన్నారు. మెడికల్ కళాశాల, ఫార్మసీ, నర్సింగ్ కళాశాల, పీజీ కళాశాల ఎన్నో విద్యాలయాలను తీసుకొచ్చి విద్యాహబ్‌గా తీర్చిదిద్దామన్నారు. సిద్దిపేటకు ఐటీ హబ్, ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో ఉన్నాయన్నారు. సిద్దిపేటలోని రైతుబజార్, సమీకృత మార్కెట్‌ను ఎక్కడి నుంచో వచ్చి చాలామంది చూసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి వాటిని ఇతర పట్టణాల్లో కట్టుకుంటామని చెప్పి ఆయా పట్టణాల్లో నిర్మాణాలు చేసింది వాస్తవం కాదా..? ఇది లోకానికి తేల్వదా అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేట అభివృద్ధి కాలేదు అని పచ్చి అబద్ధాలు మాట్లాడితే జనం నమ్మాలా ..?అని అన్నారు. అన్నింటి కంటే మించి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చింది సిద్దిపేట కదా అని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి కేసీఆర్ బయలుదేరితే ఆశీర్వదించి, ఆనాటి సీమాంధ్ర శక్తులను ఎన్నో కుట్రలు చేసిన వాటిని తిప్పికొట్టి అందించింది సిద్దిపేట గడ్డ అని చెప్పారు. సిద్దిపేట ప్రజల చైతన్యమే తెలంగాణ పార్టీని పుట్టించిందన్నారు. ఇవ్వాళ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిండు అంటే కూడా సిద్దిపేట ప్రజల పుణ్యమే అని చెప్పారు. సిద్దిపేట లేకుంటే తెలంగాణ ఉద్యమమే లేదు.. తెలంగాణ ఉద్యమమే లేకుంటే తెలంగాణ రాష్ట్రం లేదన్నారు. ఇయ్యాళ తెలంగాణ రాష్ట్రం లేకుంటే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవాడే కాదన్నారు. చంద్రబాబు అడుగులకు మడుగులు వత్తుకుంటూ... ఆంధ్రోళ్ల మోచేతి నీళ్లు తాగుకుంటూ బతుకుతుండే అని చెప్పారు. పదేండ్లుగా రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడిండు అభివృద్ధి అంతా మెదక్ జిల్లాకే అని అక్కడే అభివృద్ధి జరుగుతుంది అని కొన్ని వందలసార్లు మాట్లాడిండన్నారు. ఇవ్వాళ నేమో ఇక్కడ అభివృద్ధి జరగలేదని మాట్లాడుతున్నాడు. మరి ఏది నిజం అని ప్రశ్నించారు. మొన్నటి వరకు మాట్లాడింది మర్చిపోయినట్లున్నావు.. నీకు కొంత మతిమరుపు వ్యాధి ఉన్నట్లుంది అని అన్నారు.

రేవంత్‌రెడ్డి హుందాగా మాట్లాడాలి

సీఎం హోదాలో ఉన్నారు. గౌరవంగా, హుందాగా ఉంటే రాష్ట్రానికి మంచిది అని హరీశ్‌రావు అన్నారు. ఇవ్వాళ మీరు చేసిన అసంబద్ధ వ్యాఖ్యలు, మా మీద బురద జల్లాలని చెప్పి మీరు చేసిన పిచ్చి ప్రయత్నం వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు రాకుండా పోయాయన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా కుదేలు అయిపోయిందన్నారు. నంగునూరు మండలం తిమ్మాయిపల్లికి చెందిన ఒక మహిళ మాట్లాడుతూ బిడ్డ పెండ్లి పెట్టుకున్నాం.. భూమి అమ్ముదామంటే ఎవ్వరూ కొనడానికి ముందుకు రావడం లేదు సార్ అని చెప్పిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు భూములు అమ్ముతారా.. అని అడిగినవాళ్లు.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భూములు కొనడానికి రావడం లేదు. ఇదేమి రాజ్యమని చెప్పిందన్నారు. తక్కువ ధరకు అమ్ముదామన్నా కొనడం లేవదన్నారు. రాష్ట్రం దివాళ తీసింది అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనవసరంగా మాట్లాడడం వల్ల రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా పోయాయన్నారు. పెట్టుబడిదారుల్లో అనుమానాలు రేకేత్తించేలా మీ మాటలు ఉన్నాయన్నారు. పెట్టుబడులు రాకుండా పోయి ఉద్యోగాలు రాక రాష్ట్ర ఆదాయం పడిపోయే పరిస్థితులు వచ్చాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే తప్పుడు ఆలోచనలతో సెల్ఫ్‌గోల్ కొట్టుకున్నారన్నారు.మాకంటే నాలుగు మంచి పనులు చేయి..ప్రజలకు మంచి చేయి..అంతేగాని అనాలోచితంగా పిచ్చి వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు.

రేవంత్‌రెడ్డిలా స్థాయిని దిగజార్చుకోలేను...

రేవంత్‌రెడ్డిలా స్థాయిని దిగజార్చుకోలేనని హరీశ్‌రావు అన్నారు. ప్రజలకు అర్థం కావడానికి చెబుతున్న... సిద్దిపేట చౌరాస్తాలో మాట్లాడుతూ హరీశ్‌రావు క్యాంప్ ఆఫీసులోనే కూర్చున్నాడు అని మాట్లాడుతాడు.. ఇక్కడనే కూసుండి ప్రసంగం వింటున్నాడని రేవంత్‌రెడ్డి మాట్లాడిండు.. ఆయన ఇక్కడ మైక్ పట్టుకునే సరికి మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండలం దౌల్తాబాద్ చౌరస్తాలో ఇంతకంటే ఎక్కువ జనంతో పబ్లిక్ మీటింగ్‌లో ఉన్నానన్నారు.. ఒక సీఎం స్థాయిలో గింత చీఫ్ పాలిటిక్స్, చిల్లర అబద్ధాలు ఆడడం అవసరమా? అని ప్రశ్నించారు. మీకు ఇంటలిజెన్స్ లేదా? తాను ఎక్కడ ఉన్నానో నెట్‌వర్క్ తెల్వదా? అని ప్రశ్నించారు. క్యాంప్ ఆఫీసులో ఉన్నాను అని చిల్లర మాటలు మాట్లాడడం ఏంటని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఎంత చిల్లర మాటలు, ఆబద్ధాలు మాట్లాడుతాడో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అని చెప్పారు. నేతి బీరకాయలో నేతి ఎంత ఉంటదో రేవంత్‌రెడ్డి మాటల్లో నిజం అంత ఉంటుందన్నారు. అబద్ధాల పునాదుల మీద గోబెల్స్ ప్రచారాల మీద శాసనసభ ఎన్నికల్లో గట్టెక్కారు. వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు ఎత్తుకపోయి సిద్దిపేట ప్రజల నోట్లో మట్టి కొట్టి, మా జిల్లాకు అన్యాయం చేసిన నీకు సిద్దిపేట ప్రజల ఓట్లు అడిగే నైతిక హక్కు ఉందా అని ప్రశ్నించారు. కొడంగల్‌లో కొత్తది పెట్టుకో మాకు అభ్యంతరం లేదు. కానీ ఇక్కడి కాలేజీ తీసుకుపోయి మా విద్యార్థులకు ఎందుకు అన్యాయం చేస్తావు అని మండిపడ్డారు. రూ. 150కోట్ల అభివృద్ధి నిధులను రద్దు చేశావ్. మెదక్, దుబ్బాక, గజ్వేల్ నిధులనూ వెనక్కి తీసుకున్నావ్. మా జిల్లా నోరు గొట్టి ఇంకా సిగ్గు లేకుండా ఓట్లు అడుగుతున్నావా? అని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కు పాలన చేతకాదు

- హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత మోసం చేసింది..
- కొడిపల్లి, కొల్చారం రోడ్‌షోలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి
- కార్యకర్తలు బెదరొద్దు.. అండగా నేనున్నా: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడతా: మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

కొడిపల్లిలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాసరెడ్డి, భారీగా హాజరైన జనం

నర్సాపూర్/చిలిపిచెడ్(కొల్చారం), మే 3: సమర్థవంతమైన పాలన చేయడం కాంగ్రెస్‌కు చేతకాదని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా శుక్రవారం కొడిపల్లి, కొల్చారం మండలంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో కలిసి రోడ్‌షో నిర్వహించారు. పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ధాన్యానికి బోనస్‌గా రూ.500 చెల్లిస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదన్నారు. మోసం చేసిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రైతులు అప్పు చేయకుండా వ్యవసాయం చేసే స్థాయికి ఎదగాలని కేసీఆర్ రైతుబంధు ప్రవేశ పెట్టి చేయూత నిచ్చారన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వడం లేదన్నారు.

ఎవరికీ భయపడేది లేదు: సునీతాలక్ష్మారెడ్డి

కొందరు నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలను బయపెడుతున్నారని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, తాను మహిళనే కావచ్చు కానీ ఉక్కు మహిళనని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో బీఆర్ఎస్‌కు ఎలాంటి నష్టం లేదని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కంటే ఈసారి డబుల్, ట్రిపుల్ మెజార్టీ వస్తుందన్నారు. కారు గుర్తుకు ఓటేసి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలన్నారు. నర్సాపూర్ రోడ్‌షోలో మండల నాయకులు మన్సూర్, చంద్రాగౌడ్, గోపి, రామాగౌడ్, కొల్చారం రోడ్‌షోలో ఎంపీపీ మంజుల, జడ్పీటీసీ మేఘమాల, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గౌరీశంకర్, నాయకులు సంతోషిరావు, రవితేజరెడ్డి, శ్రీధర్, దుర్గాప్రసాద్‌గౌడ్, స్థానిక మాజీ సర్పంచ్ కరెంట్ ఉమాదేవి రాజాగౌడ్, కొమ్ముల యాదాగౌడ్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు: వెంకట్రామిరెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు పెడుతున్నదని, వాటికి భయపడేది లేదని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలకు, యువతకు, మహిళలకు, నిరుద్యోగులకు సేవా కార్యక్రమాలు చేస్తానని హామీ ఇచ్చారు. రోడ్‌షోకు పెద్ద సంఖ్యలో హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భయపడాల్సిన పనిలేదని, కార్యకర్తలు ఆపదలో ఉంటే గంటలో మీ ముందుంటానని భరోసా ఇచ్చారు. కార్యకర్తలపై పోలీస్ జులూం ఎలా ఎదిరించాలో మాజీ కలెక్టర్‌గా తనకు తెలుసన్నారు. అధికారిగా, విద్యావంతుడిగా ప్రజాసేవ చేయడం తెలుసన్నారు. నర్సాపూర్ పట్టణంలో ఓ ఫంక్షన్‌హాల్ కట్టించి పేదింటి శుభకార్యాలకు ఉచితంగా అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థిని, విద్యార్థులకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి పోటీ పరీక్షలు రాయడానికి దోహదపడతానని తెలిపారు. ఎంపీగా నిలబడిని ముగ్గురి అభ్యర్థులలో గుణగణాలను చూసి ఆశీర్వదించాలని కోరారు. నిలకడలేని వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థి అని, అబద్ధాలు చెప్పే వ్యక్తి రఘునందన్‌రావు అని ఎద్దేవా చేశారు.

సీఎం హుందాగా వ్యవహరించాలి

- నాపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరం
- విలేకరులతో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 3: సిద్దిపేట కాంగ్రెస్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి తనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలో బూత్ లెవల్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన వెంకట్రామిరెడ్డి అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం కుర్చీలో హుందాగా ఉండాల్సిన రేవంత్‌రెడ్డి అందరు భిన్నంగా ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారిగా, కలెక్టర్‌గా 25 ఏండ్లు సమర్థవంతంగా పని చేసిన రికార్డు తనకుందన్నారు. నాకు అప్పగించిన బాధ్యతను సరిగ్గా నిర్వర్తించడంతో గమనించి కీలక బాధ్యతలు ఇచ్చారన్నారు. ప్రజలకు సేవలందించడంలో ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదన్నారు. అందుకే ప్రజలు నన్ను గుర్తించి ఆశీర్వదిస్తున్నారన్నారు. సిద్ధిపేట గడ్డ నుంచి కాంగ్రెస్ గెలుపు ఖాయమని రేవంత్‌రెడ్డి అన్నాడు. కానీ మెదక్ ఎంపీగా తాను గెలవడం ఖాయమైందని వెంకట్రామిరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీస్సులు, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రోత్సాహం, స్థానిక ఎమ్మెల్యేలు నాయకుల అండతో నాకు మంచి మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎంగా ఉంటూ బూతు దజల్లే స్థాయి మాటలు రేవంత్ నోటి నుంచి వస్తున్నాయని మండిపడ్డారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మెదక్ ఉమ్మడి జిల్లా ప్రజలు తిరస్కరించారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అవే ఫలితాలు వస్తాయన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలే బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఓటు అడిగే హక్కు రేవంత్‌కు లేదు

- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, మే 3: సిద్దిపేట ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి విచక్షణ కోల్పోయి మాట్లాడారని మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని హరీశ్‌రావు నివాసంలో బీఆర్ఎస్ నాయకులు పాల సాయిరామ్, మారెడ్డి రవీందర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు సిద్దిపేటను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్ది, అభివృద్ధిలో మొదటి వరుసలో నిలిపారన్నారు. కేసీఆర్ పోరాటం వల్ల వచ్చిన తెలంగాణకు రేవంత్‌రెడ్డి శనిలా పట్టాడని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ యూనివర్సిటీని కొడంగల్‌కు తరలించుకుపోయిన రేవంత్‌కు సిద్దిపేటలో ఓటు అడిగే హక్కు లేదన్నారు. సీఎం హోదాలో ప్రచారానికి వచ్చిన రేవంత్‌రెడ్డి సిద్దిపేట అభివృద్ధికి ఏం చేస్తాడో చెప్పకుండా కేసీఆర్, హరీశ్‌రావులను తిట్టడానికి వచ్చాడా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అబద్ధం అని చెప్పిన రేవంత్‌రెడ్డి మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు తరలించాలని అధికారులు ఆదేశించడం దేనికి నిదర్శనమన్నారు. సిద్ధిపేట అభివృద్ధి కేసీఆర్, హరీశ్‌రావు హయాంలో జరిగిందన్నారు. రైతు రుణమాఫీపై గన్‌పార్క్ వద్దకు రాజీనామాతో హరీశ్‌రావు వస్తే రేవంత్ వెన్ను చూపి పారిపోయాడన్నారు. కాంగ్రెస్ పాలనలో తిట్లు, ఓట్లు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. సిద్దిపేట ఉద్యమ గడ్డ అని, ఇక్కడి బిడ్డలకు ఉద్యమాలు చేయడం కొత్త కాదన్నారు. రాజీనామాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదని, ప్రజలు అడిగిన ప్రతిసారి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి వెళ్తామన్నారు. సినిమా డైలాగులు కొట్టుడు కాదు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రేవంత్‌రెడ్డికి సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్, హరీశ్‌రావులను ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి రైతుల భూములు గుంజుకొని రియల్ ఎస్టేట్ చేశాడని సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు మాటలు మాట్లాడారని, సీఎం హోదాలో హుందాగా మాట్లాడాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి మేరుగు మహేశ్, మహిపాల్‌గౌడ్ తదితర నేతలు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెసోళ్లను నిలదీయాలి
- ప్రజా సమస్యలు పట్టని కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలి
- ఉద్యమకారుడు గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలి
- న్యాల్‌కల్ రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు



న్యాల్‌కల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, పక్కన గాలి అనిల్‌కుమార్

న్యాల్‌కల్, మే 3: గెలుపు కోసం కాంగ్రెస్ మరోసారి మాయ మాటలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తుందని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కర్త దేవీ శ్రీప్రసాద్ అన్నారు. శుక్రవారం న్యాల్‌కల్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయడంతో విఫలమైందన్నారు. ప్రజలు, రైతులకు మోసం చేసేందుకు పార్లమెంట్ ఎన్నికలను అడ్డుపెట్టుకుని బూటకపు గ్యారెంటీలతో మళ్లీ ప్రజల్లోకి వస్తున్న కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయారన్నారు. రైతులకు ఇస్తామన్న రైతుబంధు కింద రూ.15వేలు నేటికీ అమలు చేయలేదన్నారు. గతంలోని కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రూ.10వేలు కూడా అందించలేదన్నారు. పంట అమ్ముకోవడానికి రైతులకు ఎలాంటి భరోసా కల్పించడం లేదని ఆరోపించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం పత్తాలే కుండా పొయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణలో కరువుఛాయలు అలుముకొన్నాయని, తాగు, సాగునీరు, విద్యుత్ తదితర సమస్యలతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడు